క్లుప్తంగా

నేడు ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లి లక్ష్మీనరసింహ్మాస్వామి దేవాలయం పాలక వర్గం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం గురువారం ఉదయం 11 గంటలకు దేవాలయం ఆవరణలో నిర్వహిస్తునట్లు ఆలయ ఈఓ నర్సింహులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, దేవాదాయ శాఖ జిల్లా అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు ఉద్యోగ మేళా

నాగర్‌కర్నూల్‌రూరల్: ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 10న విజయ బయో ఫర్టిలైజర్స్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్, డెలివరీ పార్ట్‌నర్స్ ఉద్యోగాలను భర్తీ చేయనునట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి బి రాఘవేందర్ సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని నేషనల్ ఐటీఐ కళాశాల ఆవరణలో ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ. 12 వేల నుంచి రూ.18 వేల వరకు వేతనం ఉంటుందని పేర్కొన్నారు. 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదివి 18 నుంచి 30 సంవత్సరాలలోపు నిరుద్యోగ అభ్యర్థులు హాజరు కావాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక

కల్వకుర్తి రూరల్: ఆర్యవైశ్య మహాసభ పట్టణ, మండల నూతన కమిటీ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టణ కమిటీ అధ్యక్షుడిగా వాస శేఖర్, మండల శాఖ అధ్యక్షుడిగా గంధం ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా జూలూరు వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఆర్యవైశ్య మహాసభ నాయకులు నూతన కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించారు.

లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్‌గా అనిల్ గౌడ్

చారకొండ: టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కమిటీ జాయింట్ కన్వీనర్‌గా మండల కేంద్రానికి చెందిన అడ్వకేట్ ఆరెళ్ల అనిల్ గౌడ్ నియామకం అయ్యారు. ఈ సందర్భంగా టీపీసీసీ రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ బుధవారం హైదరాబాద్‌లో అనిల్‌గౌడ్‌కు నియామకపత్రాన్ని అందజేశారు.

కుక్కల దాడిలో దూడ మృతి

ఊర్కొండ: కుక్కల దాడిలో లేగ దూడ మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు పోలే శేఖర్ ఎప్పటిలాగే వ్యవసాయపొలంలో ఆవులతో పాటు లేకదూడను కట్టి ఇంటికి వచ్చాడు. బుధవారం తెల్లవారుజామున రైతు పొలానికి వెళ్లగా అప్పటికే కుక్కలు దాడి చేసి లేగ దూడను చంపివేశాయి. బాధిత రైతు బోరున విలపించారు.

రోడ్డు పనుల పరిశీలన



కల్వకుర్తిరూరల్: మండలంలోని జిల్లెల్ల, ఎంగంపల్లి గ్రామాల మధ్య రూ.2 కోట్లతో నిర్మాణం చేపట్టే రోడ్డును బుధవారం పంచాయతీరాజ్ డివిజనల్ ఇంజనీర్ బసవలింగం, ఏఈ షబ్బీర్‌లు పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లెల్ల మాజీ సర్పంచ్ రాములు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

కోడేరు: మండల కేంద్రానికి చెందిన బుక్ కీపర్ మధు బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు రఘువర్ధన్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటస్వామి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఒకరికి జైలు

కల్వకుర్తి టౌన్: మద్యం తాగి వాహనాలను నడిపిన ఒకరికి జరిమానాతో పాటుగా జైలుశిక్ష విధించిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలో రెండు రోజుల కిందట డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా ఒకరు పట్టుబడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందిన కొండల్ పట్టణంలో నివాసముంటున్నారు. నిందితుడికి రెండు రోజుల జైలుశిక్షతో పాటుగా, రూ.100 ఫైన్ జడ్జి కావ్య విధించారు.

ఎంపీఓ ఆకస్మిక తనిఖీ

తాడూరు: మండల కేంద్రంతో పాటు మేడిపూర్, ఇంద్రకల్ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని ఎంపీఓ బ్రహ్మచారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలన్నారు.



మహిళా సాధికారతకు కృషి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ బదావత్ సంతోష్, అధికారులు

నాగర్‌కర్నూల్: జిల్లాలో మహిళా సాధికారతకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్‌ల ఏర్పాటు ప్రగతిపై ప్రజాభవన్ నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో మహిళా స్వయం సహాయక బృందాల ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు జిల్లాలో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు కావలసిన ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల ఎంపికకు జిల్లా యంత్రాంగం ఇప్పటికే గుర్తించినట్లు వివరించారు. ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారుచేస్తున్నామని తెలిపారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉన్న భూములను గుర్తించామన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తిని పెంచుతామన్నారు. వనరులను సమకూర్చుతామని పేర్కొన్నారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి తోడ్పాటునందించాలి

నాగర్‌కర్నూల్: జిల్లా అభివృద్ధికి ఉద్యోగులు తోడ్పాటు అందించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. బుధవారం టీజీఓల ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, టీజీఓ యూనియన్ కార్యవర్గ సభ్యులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. గెజిటెడ్ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు పి. రాజశేఖర్ రావు, కార్యదర్శి పి. సంజీవ్, గౌరవ అధ్యక్షుడు ఖాజా మైనోద్దీన్, కోశాధికారి రాజు గౌడ్, లలిత, రవీందర్ రెడ్డి, ఎండీ యూనిస్, జహంగీర్, పాల్గొన్నారు.

మోడల్ హౌస్ నిర్మాణానికి శంకుస్థాపన



తిమ్మాజిపేటలో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

తిమ్మాజిపేట: మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణం పనులు వీలైనంత త్వరగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయ పరిసరాలను ఆయన పరిశీలించారు. పీడీ సంగప్ప, ఎంపీడీఓ లక్ష్మీదేవి, వెంకట్రామ్‌రెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు మల్లయ్యగౌడ్, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌బహదూర్, దానం బాల్‌రాజ్, మాధవులు, లక్ష్మీనారాయణ, నాగసాయిలు, లక్ష్మయ్య, ముబారక్, రమేష్, మల్లేష్, బంగారు, ఆర్‌ఐ రవిచంద్ర, ఏఈ రాజవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు అండగా ఉంటాం

నాగర్‌కర్నూల్‌రూరల్: అనాథ పిల్లలకు అండగా ఉంటామని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి భరోసా ఇచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మున్నూరుకాపు ఫంక్షన్‌హాల్‌లో జనవికాస స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అనాథ బాలిక పుట్టిన రోజు వేడుకలలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనాథ పిల్లలకు కావలసిలన పుస్తకాలను, స్కూల్ బ్యాగులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జనవికాస స్వచ్ఛంద సేవ సంస్థ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



కల్వకుర్తిలో పాలాభిషేకం చేస్తున్న నాయకులు

వెల్దండ: మండల కేంద్రంలో హైదరాబాదు–శ్రీశైలం జాతీయ రహదారిపై బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు బీటీ రోడ్లను మంజూరు చేయడంతో నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, నాయకులు భూపతిరెడ్డి, సంజీవ్‌కుమార్, వెంకటయ్యగౌడ్, పర్వత్‌రెడ్డి, పుల్లయ్య, తిరుపతిరెడ్డి, ఎర్రశ్రీనుముదిరాజ్, రషీద్, అలీ, శ్రీను, పుల్‌సింగ్ ఉన్నారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని తర్నికల్ నుంచి శ్రీరాంనగర్ వరకు బీటీ రోడ్డు మంజూరు కావడంతో మాజీ సర్పంచ్ పవన్‌కుమార్‌రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం శ్రీరాంనగర్ గ్రామస్తులు సీఎం, ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో భాస్కర్, తిరుపతయ్య, మురళీ, తిరుపతి, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



పెద్దకొత్తపల్లి: వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం దగ్గర వనితా క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆ క్లబ్ అధ్యక్షురాలు గీతారాణి, ప్రధాన కార్యదర్శి శ్రీలత, కోశాధికారి పద్మలు బహుమతులు అందజేశారు. ప్రథమస్థానంలో గనుంపల్లి వరలక్ష్మి, రెండో స్థానంలో గనుంపల్లి జ్యోతిలు నిలిచారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ అధ్యక్షుడు నరసింహ శెట్టి, ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్, కోశాధికారి ప్రవీణ్, పురోహితుడు ప్రవీన్ కుమార్ శర్మ, చంద్రమౌళి, లక్ష్మణ్ శెట్టి పాల్గొన్నారు.

ఉద్యోగ కల్పనే ప్రభుత్వ ధ్యేయం



అచ్చంపేట రూరల్/మన్ననూరు: ఉద్యోగ కల్పనే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే వంశీకృష్ణ చేతుల మీదుగా అమ్రాబాద్ మండలం మన్ననూర్‌కు చెందిన దూమర్ల సంధ్యారాణి జెన్‌కో కెమిస్ట్‌గా గెజిటెడ్ ఉద్యోగ నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాపాలనలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ దూమర్ల లక్ష్మణ్ పాల్గొన్నారు.

సమస్యల సాధనకోసం ఉద్యమిద్దాం



తెలకపల్లి: సమస్యల సాధనకోసం ఉద్యమిద్దామని సీపీఎం మండల కార్యదర్శి గోపాస్ లక్ష్మణ్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. భూమిలేని వ్యవసాయ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ఎం విజయ్ గౌడ్, నందిపేట భాస్కర్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఎఫ్ డివిజన్ అధ్యక్షుడిగా భాస్కర్

కల్వకుర్తి రూరల్: మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కల్వకుర్తి డివిజన్ కమిటీ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ఇంజమూరి భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం పట్టణంలోని టీఎస్ యూటీఎఫ్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో జిల్లా కన్వీనర్ దేవరపాక ప్రభాకర్ డివిజన్ కమిటీని ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా పాలాది రామేశ్వరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యాదగిరి, కోశాధికారిగా జంగయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఈనెల 11న ఓయూలో నిర్వహించనున్న సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



రంగాపూర్‌లో మాట్లాడుతున్న సీఐ రవీందర్

నాగర్‌కర్నూల్ క్రైం: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం డీఎస్పీ గిరికుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో సైబర్‌నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా సైబర్‌నేరగాళ్లబారిన పడితే 1930 నంబర్‌కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డా.రమాదేవి పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: మండలంలోని రంగాపూర్‌లో సైబర్‌నేరాలపై సీఐ రవీందర్, ఎస్ఐ రమేష్ అవగాహన కల్పించారు. అదేవిధంగా గ్రామంలో నిర్వహించే నిరంజన్ షావలి ఉర్సును ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు.

కల్వకుర్తి టౌన్: సైబర్‌నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ మాధవరెడ్డి అన్నారు. పట్టణంలోని వైఆర్ఎం కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, చట్టాలు, జరుగుతున్న తీరుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంలోని సీఎల్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలపైన అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ నరేష్, విద్యార్థులు ఉన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన

కొల్లాపూర్ రూరల్: మండలంలోని రామాపురంలో తాగునీటి ఎద్దడి నెలకొంది. నెల రోజుల నుంచి తాగునీరు సరఫరా కాకపోవడంతో బుధవారం 7వ వార్డు చెందిన మహిళలు రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. తక్షణమే గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారికి సామజిక కార్యకర్త ఆకునమోని చంద్రయ్య మద్దతు తెలిపారు. మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డిప్యూటీ డైరెక్టర్ తనిఖీ



తాడూరు: మండల కేంద్రంలోని కూచుకుళ్ల సౌభాగ్య జూనియర్ కళాశాలను బుధవారం ఇంటర్‌బోర్డు డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన 90 రోజుల యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని, విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని అధ్యాపకులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కళాశాలలో ప్రిన్సిపాల్ వెంకటరమణ, అధ్యాపకులు ఉన్నారు.

కఠినంగా శిక్షించాలి

మన్ననూర్: హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌పై దాడికి పాల్పడిన బీజేపీ దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు రహీం, శ్రీనివాసులు, హన్మంత్‌రెడ్డి, బుచ్చయ్య, వెంకటరమణ, సత్యనారాయణ, రాజారాం, శంకరయ్య, కృష్ణయ్య, తిరుపతి, చరణ్, లోకనాథం డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. రాష్ట్రంలో శాంతి భద్రల సమస్య సృష్టించేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. గాంధీ భవన్‌పై బీజేపీ అల్లరి మూకలు మూకుమ్మడిగా దాడికి పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజా పాలనను చూసి ఓర్వలేక బీజేపీ ముఖ్య నాయకులు దాడులకు పాల్పడుతున్నారన్నారు. జాతీయ నాయకురాలు ప్రియాంక గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

డ్రెయినేజీ నిర్మాణ పనులకు భూమి పూజ

కొల్లాపూర్ రూరల్: పట్టణంలోని ఐదో వార్డులో సైడ్ డ్రెయినేజీ నిర్మాణ పనులకు బుధవారం మున్సిపల్ వైస్ చైర్మన్ మహముదాబేగం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి జూపల్లి కృష్ణారావు, మున్సిపల్ చైర్మన్ మేకల రమ్య సహకారంతో టీయూఎఫ్ఐడీసీ కింద రూ.40 లక్షలు నిధులు మంజూరు చేయించారన్నారు. పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని కంట్రాక్టర్‌ను ఆదేశించారు. సింగిల్ విండో డైరెక్టర్ పసుపుల నరసింహ, రాజశేఖర్ గౌడ్, కార్యకర్తలు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

కంప్యూటర్ వితరణ



కొల్లాపూర్: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలకు రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా కంప్యూటర్‌ను వితరణ చేశారు. బుధవారం పాఠశాల ఎస్ఓ సువర్ణకు పట్టణంలోని రత్నగిరి ఫౌండేషన్ కార్యాలయంలో కన్వీనర్ కేతూరి ధర్మతేజ కంప్యూటర్‌ను అందించారు. ఉపాధ్యాయులు మంజుల, హేమలత, ఫౌండేషన్ సభ్యులు సాయిచరణ్, సురేష్ తదితరులు ఉన్నారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో కస్తూర్బాగాంధీ పాఠశాలకు రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాయింట్ మేనేజింగ్ ట్రస్ట్ జూపల్లి జగన్ మోహన్‌రావు సహకారంతో కంప్యూటర్, బ్యాటరీలను ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ పంపిణీ చేశారు. బుధవారం పాఠశాలలో ఎస్ఓ సువర్ణకు కంప్యూటర్‌ను అందజేశారు. మంజుల, హేమలత, సాయిచరన్, సురేష్‌లు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద జీవితం ఆదర్శం

లింగాల: స్వామి వివేకానంద జీవితం ఆదర్శమని హెచ్ఎం కొండయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివేకానంద యువజన సంఘం అచ్చంపేట శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. మండలంలోని కోమటికుంట, అప్పాయపల్లి గ్రామాల్లో వివేకానందుడి విగ్రహాలకు యువత పూలమాలలు వేసి ఆయన అడుగుజాడల్లో నడుస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వరశర్మ, పురుషోత్తం, రమేష్, రాంచంద్రయ్య, శంకరయ్య, శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి



కేజీబీవీలో భోజనం చేస్తున్న డీఈఓ రమేష్‌కుమార్

వంగూరు: విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని, కొండారెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొండారెడ్డిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో 10వ తరగతి గదిలో ఉపాధ్యాయుల బోధన ప్రక్రియను పరిశీలించారు. వంగూరు కేజీబీవీ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల బోధన పద్ధతులను పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కేజీబీవీల పర్యవేక్షణ అధికారిని శోభారాణి, ఎంఈఓ మురళీ మోహనాచారి పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల రాస్తారోకో



ఊర్కొండలో దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

కొల్లాపూర్: హైదరాబాద్‌లో బీజేపీ కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ నాయకుల దాడిని నిరసిస్తూ బుధవారం పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు రాస్తారోకో చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ హృషికేష్ ఘటన స్థలానికి చేరుకొని ఆందోళన విరమించాలని కోరారు. వారు ససేమిరా అనడంతో వారిని బలవంతంగా పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. సందు రమేష్, కేతూరి నారాయణ, సాయికృష్ణగౌడ్, కల్పనారెడ్డి, కాడం శ్రీనివాస్, కాకి సత్యనారాయణగౌడ్, భరత్‌చంద్ర, శివకృష్ణయాదవ్, శ్రీరాం యాదవ్, భాస్కర్‌గౌడ్, మద్దిలేటి ఉన్నారు.

దాడి సరికాదు

చారకొండ: హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం సరైంది కాదని మహిళ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి లావణ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకుల దాడి హేయమైన చర్య అన్నారు. సమావేశంలో నాయకులు కిరణ్, శ్రీకాంత్, అనిల్ ఉన్నారు.

రహదారిపై నిరసన

ఊర్కొండ: బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ నాయకుల దాడిని ఖండిస్తూ బుధవారం మండల కేంద్రంలోని కల్వకుర్తి– జడ్చర్ల ప్రధాన రహదారిపై బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించగా ఎస్ఐ వీరబాబు అడ్డుకొని ఆందోళనకారులను చెదరగొట్టారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని ఉపాధ్యాయులు

కల్వకుర్తి రూరల్: ప్రభుత్వం ఎన్ని నిబంధనలు తీసుకొచ్చిన ఉపాధ్యాయులు విధుల్లో నిర్లక్ష్యం వీడటం లేదు. ప్రార్థన సమయానికే ఉపాధ్యాయులు పాఠశాలలకు చేరుకోవాలని నిబంధనలు ఉన్నా పట్టించుకోవడం లేదు. బుధవారం కల్వకుర్తి మండలం కురుమిద్ద ప్రాథమిక పాఠశాలలో ఉదయం 9:30 గంటలు దాటిన ఒక్క ఉపాధ్యాయుడు కూడా సమయానికి హాజరుకాలేదు. చేసేదేమీ లేక చిన్నారులు పాఠశాల ఆవరణలో ఆడుకుంటూ కాలక్షేపం చేశారు. ఇద్దరు ఉపాధ్యాయులకు ఒక్కరూ కూడా హాజరుకాకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎంఈఓ శంకర్‌నాయక్ వివరణ కోరగా కాంప్లెక్స్ హెచ్ఎం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

నైపుణ్యం వెలికితీసేందుకు క్రీడా పోటీలు

నాగర్‌కర్నూల్‌రూరల్: యువత నైపుణ్యం వెలికితీసేందుకు క్రీడా పోటీలు దోహదం చేస్తాయని డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు నాగపూరు మధు పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీవైఎఫ్ఐ దేశిటిక్యాల గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను విజయవంతం చేయాలని కోరారు. 12,13,14 తేదీలలో పోటీలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ.15 వేలు, రెండో బహుమతి రూ.10 వేలు, 3వ బహుమతి రూ.5 వేలు అందజేయనున్నట్లు వివరించారు. నాయకులు ఆంజనేయులు, రాజు, నాగరాజు, గోపాల్, పరమేష్, శంకర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఓర్వలేకే విమర్శలు

తిమ్మాజిపేట: ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లయ్యగౌడ్, కార్యదర్శి మాధవులు ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారాలు మానుకోవాలన్నారు. సమావేశంలో శ్రీనివాస్‌బహదూర్, దానం బాల్‌రాజ్, బెన్నీ, రమేష్, మల్లేష్, శ్రీశైలం పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



సాక్షి, నెట్‌వర్క్: చారకొండ: మండలంలోని గోకారం గ్రామానికి చెందిన ఇద్దరికి సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి నిధుల మంజూరు చేయించారు. ఈ మేరకు బుధవారం లింగంఅలివేలుకు రూ.15వేలు, బాదగోని లక్ష్మయ్యకు రూ.38 వేలను గ్రామంలో లబ్ధిదారులకు మాజీ ఎంపీటీసీ కొండల్ అందజేశారు.

– తాడూరు మండలంలోని పాపాగల్ గ్రామానికి చెందిన ఎండీ గౌస్‌కు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు శ్రీనావాసులు, మాజీ ఎంపీటీసీ రమేష్‌లు అందజేశారు.

– పెద్దకొత్తపల్లి మండలంలోని దేవల్ తిర్మలాపూర్ గ్రామానికి చెందిన 6 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మాజీ సర్పంచ్ సత్యం పంపిణీ చేశారు. శ్రీనివాసులు, చంద్రయ్య, విష్ణు, బాలస్వామి, బక్కయ్య, వెంకటేష్, స్వామి, దేవేందర్, శ్రీరాములు పాల్గొన్నారు.

రైతుల ఆందోళన

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి దశరథం మాట్లాడుతూ అర్హులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని, రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాముడు, లక్ష్మయ్య, వెంకటయ్య, సురేష్, నాగయ్యలు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరుడి ఉత్సవాలకు మంత్రి సీతక్కకు ఆహ్వానం

అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో ఈ నెల 16నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే స్వామివారి బ్రహ్మోత్సవాలకు రావాలని బుధవారం హైదరాబాద్‌లో మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ భీరం మాధవరెడ్డి ఆహ్వాన పత్రికను అందజేశారు. వీలును బట్టి ఉత్సవాలకు వస్తానని మంత్రి చెప్పారని వారు తెలిపారు. కార్యక్రమంలో భీరం నితీష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంఈఓకు వినతి

తిమ్మాజిపేట: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఈఎల్ఎస్ మంజూరు చేయాలని కోరుతూ టీఎస్ యూటీఎఫ్ మండల నాయకులు బుధవారం మండల కేంద్రంలో ఎంఈఓ సత్యనారాయణశెట్టికి వినతి పత్రం అందజేశారు. అనంతరం యూనియన్ క్యాలెండర్, డైరీని ఆయన ఆవిష్కరించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మండల అధ్యక్ష, కార్యదర్శులు నసీర్, గౌతం తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు నష్టం కలిగిస్తే సహించం

బల్మూర్: చెరువులలో నీటిని తొలగించి మత్స్యకారుల జీవితాలతో చెలగాటం ఆడితే సహించేది లేదని మత్స్యకారుల సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు వాకిటి ఆంజనేయులు అన్నారు. మండలంలోని చెన్నారం సమీపంలో ఉన్న నల్లచెరువు తూమును ధ్వంసం చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. బుధవారం సంఘం డైరెక్టర్లతో కలిసి ఆయన చెరువును పరిశీలించారు. సంఘం డైరెక్టర్ వెంకటయ్య, నియోజకవర్గ కోశాధికారి పాపయ్య, తుమ్మన్‌పేట అధ్యక్షుడు వెంకటయ్య, లింగం, సత్యనారాయణ, దశరథం, నిరంజన్, పరమేష్, నారాయణ, శివరాం, గోపాల్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని రెడ్డి భవనంలో మండల రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు కట్టా చిన్న జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో క్యాలెండర్‌ను బుధవారం ఉమ్మడి పాలమూరు జిల్లా రెడ్డి సేవాసమితి అధ్యక్షుడు తూం ఇంద్రసేనారెడ్డి ఆవిష్కరించారు. మహిళలకు ముగ్గులు, ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. రాజేందర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, జెపాల్‌రెడ్డి, కవిత, సుమతి, సరిత, నరేందర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, అనంతప్రతాప్‌రెడ్డి, అనంతరెడ్డి, రామకృష్ణారెడ్డి, చిన్న జంగిరెడ్డి, జగన్ మోహన్‌రెడ్డి, రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

పీఆర్టీయూతోనే సమస్యలు పరిష్కారం



అచ్చంపేట రూరల్: పీఆర్టీయూతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సబావత్ బీచ్యానాయక్ అన్నారు. బుధవారం పట్టణంలో ఎంఈఓ జీవన్‌కుమార్ పీఆర్టీయూ క్యాలెండర్లు ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో బెస్ట్ అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్‌గా ఎంపికైన ఎంఈఓ జీవన్‌కుమార్‌ను పీఆర్టీయూ నాయకులు సన్మానించారు. శ్రీనివాసులు, వెంకట్‌రాజు, పూర్ణస్వామి, లక్ష్మణ్, రాములు, పీడీ స్వరూప పాల్గొన్నారు.

నేర పరిశోధనలో సీసీ కెమెరాలు దోహదం

నాగర్‌కర్నూల్ క్రైం: నేర పరిశోధనలో సీసీ కెమెరాలు దోహదం చేస్తాయని అదనపు ఎస్పీ రామేశ్వర్ అన్నారు. బుధవారం మండలంలోని వనపట్లలో సీసీ కెమెరాల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఏఎస్పీ మాట్లాడుతూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని దొంగతనాలను నివారించుకోవచ్చన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. సీఐ కనకయ్య, ఎస్ఐ గోవర్ధన్ ఉన్నారు.